## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ వికసిత్ భారత్ లక్ష్య సాధనకు యువత భాగస్వామ్యం ఆవశ్యకమని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.
- ❖ రాష్ట్రంలో చేపట్టిన భూ సంరక్షణ చర్యలు మంచి ఫలితాలనిచ్చాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- ❖ కృష్ణా జిల్లాలో జరిగిన పేలుడు ఘటనలో గాయపడిన పోలీసుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని హోం మంత్రి వంగలపూడి అనిత తెలియజేశారు.
- ❖ రాష్ట్రంలో వంట గ్యాస్ కొరత లేదని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.
- ❖ ఉత్తరాంధ్రలోని పలు జిల్లాలలో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.

=====================

యువత విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు. అనంతపురంలోని జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (JNTU) 15వ స్నాతకోత్సవంలో ఈరోజు ఆయన పాల్గొన్నారు. JNTU పరిధిలోని వివిధ కళాశాలల్లో డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గవర్నర్ డిగ్రీ పట్టాలను, ఉత్తమ ప్రతిభ కనబరిచిన 45 మందికి స్వర్ణ పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. మహనీయులను ఆదర్శంగా తీసుకొని యువత ఉన్నత స్థానాలకు ఎదగాలని, మంచి ఆలోచనలతో సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలన్నారు. వికసిత్ భారత్ దిశగా దేశం అడుగులు వేస్తోందని.. ఇందుకు యువత భాగస్వామ్యం, సహాయం ఎంతో అవసరమని గవర్నర్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గంలో ఈరోజు పర్యటించారు. యాడికి గ్రామంలో నిర్వహించిన జలధార కార్యక్రమంలో పాల్గొని, ప్రజావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లు, హార్టికల్చర్ ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం ప్రజావేదిక సభలో ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ... అనంతపురం జిల్లాలో భూసంరక్షణ చర్యలు చేపట్టడం వల్ల మంచి ఫలితాలు వచ్చి భూగర్భ జలాలు పెరిగాయన్నారు. అన్నమయ్య జిల్లాలో కూడా 20 వేలకు పైగా నీటి పంపులకు నీరు అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. వర్షా కాలానికి ముందు 6 మీటర్ల లోతున, తరువాత 3 మీటర్ల కంటే తక్కువగా భూగర్భ జలాలు అందుబాటులో ఉండేలా చూడాలని, ఇలా చేస్తే రాష్ట్రంలో నీటి ఎద్దడి ఉండదని పేర్కొన్నారు. రిజర్వాయర్లలో నీళ్లు నిండుగా ఉంటే.. ఎప్పటికప్పుడు మనం వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. నీరు ఒక సంపద అని, దానిని ఎంత పొదుపుగా వాడుకుంటే అంత సంపద సృష్టిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

=====================

రాష్ట్రంలో సిలిండర్ల కొరత సమస్య క్రమంగా తీరుతోందని పౌరసరఫరాల శాఖ సంచాలకులు నుపూర్ అజయ్ కుమార్ తెలిపారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఆధ్వర్యంలో విజయవాడలో ఈరోజు నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవడంతో డెలివరీల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. వంట గ్యాస్ కొరత లేదని.. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి గ్యాస్ ఏజెన్సీకి ఒక ప్రత్యేక అధికారిని నియమించామని చెప్పారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్పీజీ వంట గ్యాస్ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని, అయితే భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్తగా ప్రజలు పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) వినియోగం వైపు మళ్లాలని ఆయన కోరారు.

=====================

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్) నివారణకు అవసరమయ్యే HPV వ్యాక్సిన్ 1,90,890 డోసులను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పంపించినట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ... 14 నుండి 15 సంవత్సరాల బాలికల కోసం తొలివిడత కింద గత నెలలో పంపిన 1,90,800 డోసులకు అదనంగా మరో 1,90,800 డోసుల వ్యాక్సిన్ ను రాష్ట్రానికి అందజేసినట్టు పేర్కొన్నారు. ఈ టీకాలను వివిధ జిల్లాల్లోని బాలికల సంఖ్యకు అనుగుణంగా పంపించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. వచ్చే మే నెల వరకు బాలికలకు నిరాటకంగా వ్యాక్సిన్ పంపిణీ జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి బాలికలకు వ్యాక్సిన్ పంపిణీ చేయడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందంజలో ఉందని మంత్రి వివరించారు.

విరామం

=====================

కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పేలుడు ఘటనలో గాయపడిన పోలీసులను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఈరోజు పరామర్శించారు. మంగళగిరిలోని ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. వైద్యులను అడిగి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. గాయపడిన పోలీసులకు ధైర్యం చెప్పిన మంత్రి.. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయిస్తున్న దుకాణాల నుంచి సీజ్ చేసిన పేలుడు పదార్థాలను కోర్టుకు తరలిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పేలుడు జరిగిందని, ఈ ఘటనలో ఎస్సైతో సహా ముగ్గురు కానిస్టేబుళ్లకు

గాయాలయ్యాయని చెప్పారు. గాయపడిన వారి కుటుంబాలకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హోంమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 18 సెకన్లు)

=====================

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నం రూరల్ పరిధిలోని చిన్నాపురం జెడ్పీ హైస్కూల్ లో ఆయన ఈరోజు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో వసతులను పరిశీలించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. వారితో మాట్లాడి పాఠశాలలో వసతులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... కార్పొరేట్ స్కూల్స్ కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్నారని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకం కోసం 3 వేల కోట్ల రూపాయల ఖర్చు చేస్తున్నామన్నారు. NCERT విధానంలో సిలబస్ రూపొందించి, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోదన జరుగుతోందని మంత్రి వివరించారు.

=====================

జిల్లాలో నీటి వనరుల పరిరక్షణ, భూగర్భ జలాల పెంపు కోసం శాస్త్రీయ విధానాలతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోందని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ తెలిపారు. నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమాన్ని పెందుర్తి నియోజకవర్గం సరిపల్లి గ్రామంలో ఈరోజు ఆయన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో సుమారు 125 చెరువుల్లో నీటి నిల్వలు మెరుగ్గా ఉన్నాయని, వర్షాకాలనికి ముందు నీటి మట్టం కనీసం 6 మీటర్లు, వర్షాకాలం తర్వాత 3 మీటర్లకు తగ్గకుండా ఉండేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దిశానిర్దేశంలో జలవనరుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పెందుర్తి నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలు అధికంగా ఉన్నందున.. చెరువుల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

=====================

దక్షిణ కోస్తాంధ్ర, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రాయలసీమ, దాని పరిసర ప్రాంతాలపై ఉన్న మరో ఉపరితల ఆవర్తనం ప్రస్తుతం సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో తెలంగాణ, పరిసర ప్రాంతాలపై కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తాంధ్రలో ఈరోజు తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్నిచోట్ల కురిసే అవకాశముందని, ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అంచనావేసింది. ఉత్తరాంధ్రలోని కొన్ని చోట్ల రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగతంలో ఈదురుగాలు వీస్తాయని హెచ్చరించింది.

=====================

శ్రీకాకుళం, పార్వతీపురంమన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. రేపు ఆయా జిల్లాలలో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

=====================

=====================